https://epaper.manasamajam.com Contact No. 9989788438, 9505285656

# మన సమాజం

తెలుగు డిజిటల్ దిన పత్రిక

Truth towards the Society

చైర్మెన్ : పార్వతి సురేష్ కుమార్ ఎడిటర్ : పార్వతి రాజేష్ కుమార్

సంపుటి : 02 సంచిక : 97 శుక్రవారం 14-08-2026 పేజీలు : 4

రిపోర్టర్స్ కావలెను

మన సమాజం
Truth towards the Society

మన సమాజం తెలుగు డిజిటల్ దినపత్రికలో
నిఖార్సైన జర్నలిస్టుగా నిలబడాలనుకుంటున్నారా?
అన్ని తరహా వార్తలు, కథనాలు ఎలాంటి ఆంక్షలు లేకుండా
రాయాలని కోరుకుంటున్నారా?
తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, మండలాలల్లో
పనిచేసేందుకు విలేఖరులు కావలెను...
మీ కలాలకు పదును పెట్టండి.

సంప్రదించవలసిన నెంబర్లు
9989788438, 9505485656.

## వాళ్లు అఘోరా పూజలు చేసినా..

# దేవుడు మా దిక్కే!

**ఎల్‌నినో వచ్చినా రాష్ట్రంలో ఎల్లంపల్లి నిండింది**

**సమస్య లేకుండా దేవుడు వానలు కురిపించాడు**

**డబుల్ బెడ్రూమ్ ఇస్తామంటూ ఊరించారు.. కానీ ఇవ్వలేదు**

**మేం ఇప్పుడు కోట్ల విలువజేసే భూముల్లో ఇళ్లు కడుతున్నాం**

**ఎక్కడ పనిచేసే వాళ్లకి అక్కడే ఇంటిని కట్టి ఇస్తున్నాం**

**అబద్ధాల సంఘాలు పెట్టుకుని కొందరి ప్రచారం**

**ఆందోళన చెందొద్దు.. 22ఏ సమస్యలను పరిష్కరిస్తాం**

**ఇందిరమ్మ ఇళ్ల శంకుస్థాపన కార్యక్రమంలో సీఎం రేవంత్**



**హైదరాబాద్ సిటీ, ఆగస్టు 13**

"ఎల్‌నినో వచ్చింది.. మొత్తం ఎక్కడికక్కడ ఎండిపోతుందని అన్నారు. కానీ, ఎల్‌నినో వచ్చిన సమయంలోనే ఎల్లంపల్లి నిండింది. హైదరాబాద్‌కి తాగునీటి సమస్య లేకుండా దేవుడే వానలు కురిపించాడు. కొంతమంది మాత్రం కర్ణాటక, తమిళనాడు పోయి 'కరువు రావాలె.. జనాలు చచ్చిపోవాలే.. ఈ ప్రభుత్వం బద్నాం కావాలి' అని అఘోరా పూజలు చేశారు. అట్లాంటి దుర్మార్గులు ఎంత ఘోరంగా అఘోరా పూజలు చేసినా దేవుడు వాళ్ల దిక్కు లేడు. దేవుడు మన దిక్కే ఉన్నాడు. ఎందుకంటే మన సంకల్పం మంచిది" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. తాను గొప్ప తెలివి కల వాడినని, పెద్ద పెద్ద చదువులు చదువుకున్నానని చెప్పనని, కానీ, పది మందికి మేలు చేయాలన్న ఆలోచన తనకు ఉందని చెప్పారు. తనను దేవుడు కాపాడడానికి అది ఒక్కటీ చాలునని వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లోని కేపీహెచ్‌బీ కాలనీలో ఇందిరమ్మ ఇళ్ల టవర్ల నిర్మాణానికి మంత్రులు పొంగులేటి శ్రీనివ్ష?సరెడ్డి, శ్రీధర్‌బాబుతో కలిసి గురువారం ఆయన భూమి పూజ చేశారు. అనంతరం నిర్వహించిన సభలో మాట్లాడుతూ.. పదేళ్ల బీఆర్‌ఎస్, రెండేళ్ల కాంగ్రెస్ పాలనను ప్రజలు బేరీజు వేసుకోవాలన్నారు. "అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని చందంగా కేసీఆర్ పరిస్థితి ఉంది. "పదేళ్లు అధికారంలో ఉండి పక్క రాష్ట్రాలకు పోయి చేతబడి చేస్తారా? ఆ చేతబడి తిరగబడితే ఏమైతదో తెలుసు. బుద్ధి సక్కగా లేకపోతే చేతబడి కూడా తిరగబడతది. ఫార్మ్ హౌస్‌లో నుంచి బయటికి వెళ్లకుండా అయితది. తిరగబడి మిమ్మల్నే అష్ట దిగ్బంధం చేస్తది" అని విమర్శించారు. గతంలో ముఖ్యమంత్రిని టీవీలో తప్ప ఎప్పుడైనా నేరుగా చూశారా అని ప్రశ్నించారు. తాను మీ మధ్యనే తిరుగుతున్నానని చెప్పారు. మంచి మనసుతో మంచి ఆలోచనతో వచ్చానని, అభివృద్ధిలో తనకు రాజకీయాలు లేవని తెలిపారు. అందరూ సహకరిస్తే అద్భుతమైన తెలంగాణ, హైదరాబాద్ నగరాన్ని అభివృద్ధి చేసుకుందామని అన్నారు. ఒడిదుడుకులను అధిగమించి.. ఆర్థికంగా నిలదొక్కుకొని.. విధ్వంసమైన తెలంగాణను వికాసం వైపు నడిపించడానికి తనకు శక్తిని, ఆశీర్వాదాన్ని ఇవ్వాలని కోరారు. గత ప్రభుత్వం చేసిన అప్పులకు అసలు, మిత్తి కడుతూనే ఇన్ని మంచి పనులు చేస్తున్నానని తెలిపారు. "వయసు, ఓపిక ఉంది. మీ కోసం పని చేయాలన్న సంకల్పం ఉంది. విధ్వంసమైన తెలంగాణను వికాసం వైపు నడిపించడానికి రోజుకు 12-18 గంటలు పనిచేసే శక్తి దేవుడు ఇచ్చాడు. గతంలో ఉన్న పథకాలు కొనసాగిస్తూ అదనంగా సంక్షేమాన్ని అందిస్తున్నాం" అని వివరించారు.

మిగతా 2లో...

## ఆలింగనాలే మోదీ విదేశాంగ విధానం

**'రచనాత్మక్ కాంగ్రెస్ సదస్సు'లో రాహుల్**

**కాంగ్రెస్ నేత దీక్షిత్‌ను ఆలింగనం చేసుకుని .. మోదీ తీరు ఇలా ఉంటుందని ఎద్దేవా**

**రాహుల్ వ్యాఖ్యలు నీచంగా ఉన్నాయని మండిపడిన బీజేపీ నేతలు**

**దేశ రాజకీయాలకే తలవంపు: సంజయ్**




**న్యూఢిల్లీ, ఆగస్టు 13:**

వివిధ దేశాల అధినేతలతో ప్రధాని మోదీ ఆలింగనాలను కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ ఎద్దేవా చేశారు. రచనాత్మక్ కాంగ్రెస్ జాతీయ సదస్సు వేదికపై కాంగ్రెస్ నేత సందీప్ దీక్షిత్‌ను పిలిచి మరీ గట్టిగా ఆలింగనం చేసుకున్న రాహుల్.. ఇలా ఆలింగనం చేసుకోవడమే మోదీ విదేశాంగ విధానమని మండిపడ్డారు. 'ఆయనకు ఇలాంటి ఆలోచన ఎలా వచ్చిందో తెలియదు. జనాల బుర్రలోకి వింత ఆలోచనలు వస్తుంటాయి. దీన్నే ఆయన విదేశాంగ విధానమని అనుకుంటుంటారు' అని మోదీపై విమర్శలు గుప్పించిన రాహుల్.. ఆపై దీక్షిత్ వద్దకు వడివడిగా వెళ్లి గట్టిగా ఆలింగనం చేసుకున్నారు. 'నన్ను మెలోనీ అనుకుని ఆలింగనం చేసుకోలేదు కదా?' అని దీక్షిత్ వ్యంగ్యంగా అడగ్గా 'నేనింకా ఆ స్థాయికి చేరుకోలేదు' అని రాహుల్ వ్యాఖ్యానించారు. దీంతో సమావేశం మందిరం సభికుల చప్పట్లు, నవ్వులతో ప్రతిధ్వనించింది. ఢిల్లీలో గురువారం జరిగిన ఈ సదస్సులో రాహుల్ బీజేపీ, ఆరెసటసలపై విరుచుకుపడ్డారు. అవి జోకర్ల సమూహమని, వారికి భారతదేశ చరిత్ర, సంస్కృతి, ప్రస్తుత వాస్తవ పరిస్థితుల గురించి అవగాహన లేదని విమర్శించారు. బీజేపీ-ఆర్ఎస్ఎస్ రాజకీయ సిద్ధాంతం ఏమిటంటే.. తమకు, మరికొంతమందికి ప్రయోజనం చేకూర్చే ఒక వ్యవస్థను దేశంపై రుద్దడమేనన్నారు. కాంగ్రెస్ మాత్రం దేశాన్ని తన భావాలను వ్యక్తీకరించేందుకు అనుమతించాలని కోరుకుంటోందని చెప్పారు. జంతర్ మంతర్ వద్ద విద్యార్థులు తమ భావాలను చెప్పాలనుకున్నారని, ప్రభుత్వం దానికి అంగీకరించలేదన్నారు.

మిగతా 2లో...

## యుద్ధనౌకపై నుంచి దూకి ఆత్మహత్యాయత్నం!

**8నెలలుగా విధుల్లో ఉండటం, ఆహారం, నీటి కొరతతో**

**సైనికుల నైరాశ్యం.. అమెరికా పత్రికల్లో కథనాలు**

**న్యూఢిల్లీ, ఆగస్టు 13:**



ఇరాన్‌పై యుద్ధం కోసం అరేబియా సముద్రంలో మోహరించి ఉన్న యూఎ?సఎస్ అబ్రహం లింకన్ యుద్ధనౌకకు సంబంధించి మరో కీలక అంశం వెలుగులోకి వచ్చింది. సుమారు ఎనిమిది నెలలుగా యుద్ధనౌకపై విధుల్లో ఉన్న సైనికులు నైరాశ్యంలో కూరుకుపోతున్నారని, ఈ క్రమంలో ఆత్మహత్యాయత్నాలకు పాల్పడుతున్నారని వార్తలు వస్తున్నాయి. ఆహారం, నీటి కొరత, మరుగుదొడ్లు సరిగా లేకపోవడం, ఈ యుద్ధం ఎప్పుడు ముగుస్తుందో, ఎప్పుడు ఇళ్లకు తిరిగివెళతామోననే ఆందోళనతో సైనికులు కుంగిపోతున్నారు. ఈ మేరకు అబ్రహం లింకన్ యుద్ధనౌకలో విధుల్లో ఉన్న సైనికుల కుటుంబాలను ఉటంకిస్తూ.. అమెరికాకు చెందిన మిలిటరీ టైమ్స్, ది క్రెడిల్, మరికొన్ని పత్రికలు కథనాలు ప్రచురించాయి. ఆత్మహత్యాయత్నం చేసిన సైనికులకు సంబంధించి వారి కుటుంబాలకు నౌకాదళం అంబుడ్స్‌మెన్ నుంచి సమాచారం అందిందని, ఆరుగురు ఆత్మహత్యాయత్నం చేసినట్టు తెలిసిందని పేర్కొన్నాయి.

## రాజధానికి తొలి మెట్టు!..

**ఇక అమరావతికి తిరుగు లేదు: సీఎం చంద్రబాబు**

**సీడ్ యాక్సెస్ రోడ్డు నిర్మాణంతో రాజధాని సాకారానికి శ్రీకారం**

**స్వర్ణాంధ్రప్రదేశ్ విజన్‌కిది తొలి విజయం**

**2028లో ప్రధాని చేతుల మీదుగా ప్రారంభిస్తాం**

**గ్రాఫిక్స్ అన్నారు.. మూడు ముక్కలాట ఆడారు**

**రైతులు, సింగపూర్ ప్రతినిధులకూ వేధింపులు**

**అన్నింటినీ అధిగమించాం.. రాచబాట వేశాం**

**రాజధాని కోసం రైతులది త్యాగం కాదు.. స్ఫూర్తి**

**స్టీల్ బ్రిడ్జీలు, సీడ్ యాక్సెస్ రోడ్డు, ప్రతినిధుల క్వార్టర్స్‌ను ప్రారంభించిన ముఖ్యమంత్రి**



**అమరావతి, ఆగస్టు 13:**

రాష్ట్రాభివృద్ధిలో, అమరావతి నిర్మాణంలో సీడ్ యాక్సెస్ రోడ్డు మొదటి మెట్టు అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఉండవల్లి వద్ద అమరావతిని విజయవాడ-మంగళగిరి-గుంటూరులతో అనుసంధానించే ప్రధాన రహదారి సీడ్ యాక్సెస్ రోడ్డు ఈ-3ని సీఎం ప్రారంభించారు. ఈ రహదారిని కలుపుతూ బకింగ్‌హామ్ కాలువపై నిర్మించిన స్టీల్ బ్రిడ్జిలను కూడా ఆయన ప్రారంభించారు. దీనికి సూచికగా ఉండవల్లి వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని మంత్రులు పి.నారాయణ, నాదెండ్ల మనోహర్‌లతో కలిసి ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో చంద్రబాబు మాట్లాడారు. స్వర్ణాంధ్ర విజన్‌కు లభించిన తొలి విజయంగా ఈ ఘట్టాన్ని అభివర్ణించారు. తెలుగుజాతి గర్వపడేలా ఉమ్మడి రాష్ట్రంలో సైబరాబాద్ నిర్మాణం చేపట్టామని, దీనికోసం అప్పట్లో 15 రోజులు అమెరికాలో గడిపానని గుర్తుచేశారు. తనపై నమ్మకంతో సింగపూర్... అమరావతి బృహత్ ప్రణాళికను ఉచితంగా ఇచ్చిందన్నారు. "గత పాలకులు ప్రజలతోపాటు సింగపూర్ ప్రతినిధులను కూడా వేధింపులకు గురిచేశారు. ప్రభుత్వ కాంప్లెక్స్ భవనాలు ప్రత్యేకంగా ఉండాలని ప్రముఖ ఆర్కిటెక్టులతో డిజైన్లు చేయిస్తే.. వాటిని గ్రాఫిక్స్ అంటూ ఎగతాళి చేశారు. ఆ గ్రాఫిక్స్ నిజమవుతుంటే ఎగతాళి చేసిన వాళ్లంతా తలలు దించుకునే పరిస్థితికి వచ్చారు" అని అన్నారు. రాజధాని కోసం 40 వేల ఎకరాలు కావాలన్న వ్యక్తి (జగన్‌ను ఉద్దేశించి).. తర్వాత 3రాజధానులంటూ మాట మార్చేశారని మండిపడ్డారు. "మూడు ముక్కలాటకు వ్యతిరేకంగా 2019-24 మధ్య రైతులు చేసిన ఉద్యమాన్ని చరిత్ర మరిచిపోదు. అమరావతితో పాటు రాష్ట్రమంతా అభివృద్ధి కావాలన్నదే నా ఆకాంక్ష. అమరావతిని ఆహ్లాదకర నగరంగా తీర్చిదిద్దుతున్నాం" అని తెలిపారు. ఇంకా ఏమన్నారంటే..

**ఐదు కాన్సెప్టులతో రాజధాని....**

"అమరావతి రాజధానికి రాజమార్గం అందుబాటులోకి రావడం నగర నిర్మాణ ఘట్టంలో తొలి అడుగు. మూడో దశలో ఇది తాడేపల్లి వద్ద జాతీయ రహదారికి కనెక్టు అవుతుంది. అమరావతి పూర్తి కాలుష్య రహిత నగరంగా మారుతుంది. డీప్‌టెక్ క్యాపిటల్‌గా తయారుచేస్తున్నాం. నో పోల్స్, బ్లూ, గ్రీన్, గ్రీన్ ఎనర్జీ, క్వాంటం, డీప్‌టెక్ లాంటి ఐదు కాన్సెప్టులతో నిర్మాణం జరుగుతోంది. ఏఐ, క్వాంటం కంప్యూటర్ వ్యాలీగా అమరావతి మారుతోంది. టాప్ 5 నగరాల్లో ఒకటిగా తయారవుతుంది. అమరావతి, మంగళగిరి-తాడేపల్లి, గుంటూరు, విజయవాడ కార్పొరేషన్లు రాజధాని పరిధిలో ఉంటాయి. 190 కిమీ అవుటర్, 96 కిమీ ఇన్నర్ రింగురోడ్డు మంజూరుచేసిన కేంద్రానికి ధన్యవాదాలు. 2028 నాటికి భారత్ మెచ్చిన రాజధానిగా అమరావతిని ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రారంభిస్తాం. ఇక అమరావతిని ఎవరూ ఆపలేరు. రాజధానిలో నిర్మిస్తున్న రోడ్డును అడ్డుకునేందుకు కొందరు ప్రయత్నించారు.

మిగతా 2లో...

## ఝార్ఖండ్ అసెంబ్లీ ముట్టడి..300మందిపై కేసు!

**రాంచీ, ఆగస్టు 13:**





ఝార్ఖండ్ ప్రభుత్వ ఉద్యోగ నియామక పరీక్షల్లో జరిగిన అవకతవకలపై.. రాంచీలో అసెంబ్లీ ముట్టడికి యత్నించిన ఘటనలో దాదాపు 300మందిపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఆగస్టు 10న నిరుద్యోగ అభ్యర్థులు చేపట్టిన ప్రదర్శన ఉద్రిక్తంగా మారడంతో ఈ చర్యలు చేపట్టారు. నిషేధాజ్ఞలు ఉల్లంఘించడం, పోలీసులపై దాడి, ప్రభుత్వ ఆస్తుల్ని ధ్వంసం చేయడం వంటి అభియోగాల కింద కేసు నమోదు చేశారు. అసెంబ్లీ వద్ద విధులు నిర్వర్తించిన మెజిస్ట్రేట్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు.. హింసకు పాల్పడిన వారిని గుర్తించేందుకు వీడియో క్లిప్పింగులు, సీసీటీవీ ఫుటేజీలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు.

## రష్యాలోని కీలక రిఫైనరీపై ఉక్రెయిన్ దాడి

**కీవ్, ఆగస్టు 13:**

రష్యా-ఉక్రెయిన్ యుద్ధం మరింత ఉద్రిక్తతలకు దారితీస్తోంది. రష్యా ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా ఉన్న చమురు రంగాన్ని దెబ్బతీయడమే లక్ష్యంగా ఉక్రెయిన్ సైన్యం తన దాడులను తీవ్రతరం చేసింది. ఇందులో భాగంగా, సరిహద్దుకు సుమారు 1,300 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఒక ప్రధాన రిఫైనరీపై గురువారం ఉక్రెయిన్ డ్రోన్‌లు విరుచుకుపడ్డాయి. 'గాజ్‌ప్రోమ్ నెఫ్టెఖిమ్ సాలావత్' చమురు శుద్ధి, పెట్రోకెమికల్ సముదాయంపై డ్రోన్లతో దాడులు చేశామని ఉక్రెయిన్ సైన్యం టెలిగ్రామ్ వేదికగా వెల్లడించింది. మాస్కో చమురు పరిశ్రమను దెబ్బతీయడమే లక్ష్యంగా కీవ్ మూడు రోజుల్లో చేపట్టిన నాలుగో దాడి ఇది. మరోవైపు రష్యా కూడా ఉక్రెయిన్‌పై బాలిస్టిక్ క్షిపణులు, జెట్ డ్రోన్లు, గ్లైడ్ బాంబులతో విరుచుకుపడుతోంది. బుధవారం నుంచి గురువారం రాత్రి వరకు ఉక్రెయిన్ వ్యాప్తంగా 133 డ్రోన్లతో జరిపిన దాడుల్లో నలుగురు మరణించారు. మరో ఎనిమిది మంది గాయపడ్డారు.



## ఆగి ఉన్న బస్సును ఢీకొన్న కంటైనర్ లారీ

**ఇద్దరు మహిళల దుర్మరణం.. మరో ఇద్దరికి గాయాలు**

**నిజామాబాద్ జిల్లా గోవిందపేట్‌లో ప్రమాదం**



**ఆర్మూర్ టౌన్, ఆగస్టు 13**

ఆగి ఉన్న బస్సును కంటైనర్ లారీ ఢీ కొట్టడంతో ఇద్దరు మహిళలు మృతి చెందారు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలం గోవింద్‌పేట్ శివారులోని 44వ నంబర్ జాతీయ రహదారిపై గురువారం ఈ ప్రమాదం జరిగింది. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా కిన్వట్ గ్రామానికి చెందిన 69 మంది కలిసి గురువారం ఉదయం రెండు బస్సుల్లో హైదరాబాద్‌కు బయల్దేరారు. నిజామాబాద్ జిల్లాలోని గోవింద్‌పేట్ శివారులో ఒక బస్సు టైర్ పేలిపోవడంతో రోడ్డుపైనే నిలిపివేశారు. టైర్‌ను మార్చే సమయంలో అందులోని ప్రయాణికులు కిందికి దిగి డివైడర్‌పై కూర్చున్నారు. ఇంతలో గుజరాత్‌కు చెందిన కంటైనర్ వెనుక నుంచి అతివేగంగా బస్సును ఢీకొట్టింది. దీంతో డివైడర్‌పై కూర్చున్న ప్రయాణికులపైకి బస్సు దూసుకెళ్లింది. దీంతో తిర్మన్‌వార్ మాధవి(47), నెమ్మన్వర్ సుజాత(54) అక్కడికక్కడే మృతి చెందగా... సునీత, మనీషాకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు.

## అకాలీదళ్ అధ్యక్షుడు సుఖ్‌బీర్ సింగ్ బాదల్‌పై దాడి



**నాందేడ్, ఆగస్టు 13 :**

శిరోమణి అకాలీదళ్ పార్టీ అధ్యక్షుడు, పంజాబ్ మాజీ ఉప ముఖ్యమంత్రి సుఖ్‌బీర్ సింగ్ బాదల్‌పై దాడి జరిగింది. మహారాష్ట్ర, నాందేడ్‌లోని మాతాసాహెబ్ గురుద్వారా వద్ద గురువారం మధ్యాహ్నం ఓ వ్యక్తి బాదల్‌పై కత్తి/బాకుతో దాడి చేశాడు. ఈ ఘటనలో బాదల్ కుడి చేతికి గాయమైంది. మహారాష్ట్ర పర్యటనలో ఉన్న బాదల్, తన భార్య, ఎంపీ హర్‌సిమ్రత్ కౌర్‌తో కలిసి నాందేడ్‌లోని మాతా సాహెబ్ గురుద్వారాను సందర్శించారు. అయితే, జడ్ ప్లస్ కేటగిరీ భద్రతలో ఉన్న బాదల్ గురుద్వారా మెట్లు దిగుతుండగా.. సిక్కు సమాజంలో యోధుల వర్గమైన 'నిహంగ్ సిక్కు' వేషధారణలో ఉన్న ఓ వ్యక్తి దాడి చేశాడు. గమనించిన భద్రతా సిబ్బంది అప్రమత్తమై దాడిని అడ్డుకున్నారు. కానీ, బాదల్ కుడి చేతికి కత్తిపోటు గాయమైంది. దాడిని అడ్డుకునేందుకు యత్నించే క్రమంలో బాదల్ భద్రతా సిబ్బందిలోని ఓ పోలీసుత కూడా గాయపడ్డారు. గాయపడిన బాదల్‌ను నాందేడ్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. బాదల్‌కు ఎలాంటి ప్రాణాపాయం లేదని, ఆయన కుడి చేతికి గాయమైన చోట మూడు కుట్లు పడ్డాయని పోలీసులు వెల్లడించారు.

MANA SAMAJAM

మన సమాజం

తెలుగు డిజిటల్ దినపత్రిక

శుక్రవారం, ఆగస్టు 14, 2026

# మున్సిపల్ కార్మికుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న అధికారులు

**- ప్రమాద బీమా రెన్యువల్ చేయకుండా నిర్లక్ష్యం - సిఐటియు జిల్లా కార్యదర్శి రత్నం.రాజేందర్**



**ములుగు జిల్లా ఆగస్టు 13**

ములుగు మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులకు ప్రమాద బీమా,పి ఎఫ్,ఈఎస్ఐ చేయించడంలో మున్సిపల్ అధికారులు తీవ్రమైన అలసత్వం ప్రదర్శిస్తున్నారని సీఐటియు జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్ అన్నారు. గురువారం ములుగు మున్సిపాలిటీ కార్యాలయ ఆవరణలో నద్దునూరి సుదర్శన్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా సిఐటియు ములుగు జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్ హాజరై మాట్లాడుతూ,ఇటీవల పైప్లైన్ పనులు చేస్తున్న మున్సిపల్ కార్మికుల పై మట్టి కూలిపడడం వలన 6 మంది కార్మికులకు గాయాలు అయినాయి అని అన్నారు.అంతకు ముందు రోడ్డు డివైడర్ లో ఉన్న గడ్డి తొలగిస్తున్న క్రమంలో ఇసుక లారీ మున్సిపాలిటీ చెత్త ట్రాక్టర్ ను డీ కొనడంతో కార్మికులకు ప్రమాదం తప్పిందని, మున్సిపాలిటీ కార్మికులతో అధికారులు రక్షణ లేని పనులను చేపిస్తున్నారని, పది రోజుల క్రితం పైపులైను రిపేరు చేస్తుండగా మహేందర్ అనే కార్మికుడి కాలుకు దెబ్బ తాకడంతో ప్రస్తుతం అది సెప్టిక్ అయి ఎంజీఎం లో చికిత్స పొందుతున్నాడని కాలు తీసేసే ప్రమాదం కూడా ఉందని, అలాంటి కార్మికుడికి కనీసం వైద్య ఖర్చులకోసం ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని అన్నారు.ప్రమాద బీమా రెన్యువల్ చేయాలని మున్సిపాలిటీ చైర్మన్ మరియు కౌన్సిలర్లు అందరూ ఏకగ్రీవంగా కమిషనర్ కి చెప్పినప్పటికీ చేయకుండా తాత్సారం చేస్తున్నారని అన్నారు.జి వో నెంబర్ 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని అందరి పేర్లు ఐ ఎఫ్ ఎం ఐ ఎస్ ఆర్థిక శాఖ ఆన్లైన్ పోర్టల్ లో నమోదు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జయకర్, రఘు,రాజు, భాస్కర్,బాలు, స్వరూప,రజినీకర్,సాంబయ్య, రాజేందర్,క్రాంతి, ప్రవీణ్, మహిళ కార్మికులు,తదితరులు పాల్గొన్నారు.

# తిరంగా ర్యాలీలో పాల్గొన్న మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్





**కుత్బుల్లాపూర్**

భారత ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని ఐడీపీఎల్ చౌరస్తాలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన "తిరంగా ర్యాలీ"లో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ పాల్గొన్నారు.జాతీయ జెండాను చేతబూని ర్యాలీలో పాల్గొన్న ఈటల రాజేందర్ , ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ విభిన్న జాతులు, సంస్కృతులు, భాషలు ఉన్నప్పటికీ కలిసి జీవించే దేశం భారతదేశమని అన్నారు.మనందరం భారతమాత ముద్దుబిడ్డలమని పేర్కొన్నారు.జనగణమన, వందేమాతరం వంటి జాతీయ భావనలు అసేతు హిమాచలం భారతీయులను ఐక్యంగా ఉంచుతున్నాయని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రపంచ పటంపై భారతదేశ ఔన్నత్యం సమున్నతంగా నిలుస్తోందన్నారు. దేశ అభివృద్ధి కోసం మోదీ గారికి ప్రతి ఒక్కరూ చేయూతనిచ్చి, ఆశీర్వదించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షులు గిరివర్ధన్ రెడ్డి, సీనియర్ నాయకులు మరియు ఇంచార్జి మల్లారెడ్డి, వడేపల్లి రాజేశ్వర్ రావు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కొల్లి మాధవి, జిల్లా జనరల్ సెక్రెటరీ విగ్నేష్, జిల్లా ఓబీసీ అధ్యక్షులు శేఖర్ యాదవ్, మాజీ కార్పొరేటర్ శేషగిరి రావు, కూకట్‌పల్లి అసెంబ్లీ ఇంచార్జ్ కాంత రావు, కన్వీనర్ శ్రీకర్ రావు, సీనియర్ నాయకులు నల్ల జయశేఖర్ గౌడ్, ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ విజయలక్ష్మి సుబ్బారావు, రచ్చ చక్రధర్, పద్మ ప్రసాద్,సీనియర్ నాయకులు వేముల రమేష్, బీజేవైఎం నాయకులు శ్రీనాథ్, సాయి కిరణ్ రెడ్డి, ఆర్తిక్ యాదవ్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వాళ్లు అఘోరా పూజలు.. (మొదటిపేజీ తరువాయి)

ఈ సందర్భంగా మహిళలకు ఉచితంగా బస్సు ప్రయాణం, నెలకు 200 యూనిట్ల ఉచిత కరెంటు, రూ.500లకు సిలిండర్, 70 వేల ఉద్యోగాలు.. దీపం పథకం కింద 400 రూపాయలకు స్టవ్ సిలిండర్ తదితర పథకాలను వివరించారు. స్వయం సహాయక సంఘాలకు సున్నా వడ్డీ అంటూ గత ప్రభుత్వం గుండు సున్నా పెట్టిందని, తాము రూ.65 వేల కోట్లకు బ్యాంకు లింకేజీ ఇచ్చి రూ.2500 కోట్లు మీ తరపున బ్యాంకు వడ్డీ చెల్లించామని తెలిపారు. కానీ, కొంతమంది సోషల్ మీడియాలో అబద్ధాల సంఘాలు పెట్టుకొని అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని ఎద్దేవా చేశారు.

**విలువైన భూముల్లో ఇందిరమ్మ ఇండ్లు**

ఎంతో మంది ప్రభుత్వ ఉద్యోగులకు ఇండ్ల స్థలాలు, కాలనీలు కాంగ్రెస్ ఇచ్చిందని, ఇయ్యాల ఆ సంప్రదాయమే దెబ్బతిన్నదని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. "'అహ నా పెళ్లంట' సినిమాలో కోట శ్రీనివాసరావు పైన కోడిని కట్టి కింద ఉత్తన్నం తిన్నట్టు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు అంటూ పేదోళ్లందరికీ ఊరిచ్చి ఊరిచ్చి చెప్పారు. ఇందిరమ్మ ఇల్లంటే డబ్బా ఇల్లన్నారు. అవి వద్దే వద్దు అన్నారు. మేం డబుల్ బెడ్రూమ్ ఇళ్లు ఇస్తానని చెప్పారు. ఎంతమందికి ఇచ్చారు? ఎవరికన్నా వచ్చినాయా?" అంటూ సీఎం రేవంత్‌రెడ్డి సభికులను అడిగారు. డబుల్ బెడ్రూమ్ ఇళ్లను కొల్లూరు, మేడ్చల్ అవతల కడితే పోయేది ఎన్నడు.. ఉండేది ఎన్నడు.. వాపస్ వచ్చేది ఎన్నడని ప్రశ్నించారు. పనులు చేసుకొని పోయే సరికి మధ్య రాత్రి అయితదని, పిల్లలు పండుకొంటారని విమర్శించారు. "ఇయ్యాల మా శ్రీనివాస్ రెడ్డి ఆలోచన చేసిండు. నాతోని పంచాయితీ పెట్టుకున్నాడు. ఇది చాలా విలువైన భూమి అని, ఇలా అయితే ఎలా అంటే.. మనం మాట ఇచ్చినం.. లక్ష ఇళ్లు కట్టాల్సిందేనని పట్టుబట్టారు. కూకట్‌పల్లిలో పాన్ డబ్బా అంతా జగ కావాలంటే 20 లక్షలు కావాలి. అట్లాంటిది.. 11 ఎకరాల భూమిని ఇందిరమ్మ ఇండ్లు కట్టి ఇయ్యాల్సిందేనని పట్టుబట్టాడు. ఇక్కడ పని చేసేటోళ్లకి ఇక్కడే ఇవ్వాలని, ఎక్కడ ఉండేటోళ్లకి అక్కడే ఇళ్లు కట్టాలని స్పష్టం చేశాడు. ఒక మంచి సంకల్పంతో పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అద్భుతమైన కార్యక్రమం తీసుకున్నాడు" అంటూ ఆయన్ను, హౌసింగ్ శాఖ అధికారులను సీఎం అభినందించారు. మీకు ఇల్లు వచ్చిందంటే భూమికి అణాపైసా చెల్లించాల్సిన అవసరం లేదని, ఇందిరమ్మ ఇళ్లు కట్టడానికి అయ్యే ఖర్చులో ప్రభుత్వం 5లక్షలు ఇస్తుందని, మిగతా ఐదారు లక్షలు లబ్ధిదారులు ఇస్తారని, రిజిస్ట్రేషన్ చార్జీలను కూడా రద్దు చేయలని ఆదేశాలిచ్చానని తెలిపారు.

**22ఏలో పెడితే ఒక్క ఇంచు పోదు**

"మీరు కొనుక్కున్న భూమి ఏదైనా కారణంతో 22ఏలో పడి ఉంటే ఒక్క ఇంచు కూడా ఏడికీ పోదు. నేను మీకు జమానత్ ఇస్తున్నా. అధికారులతో మాట్లాడి మీ భూమి మీరు రిజిస్ట్రేషన్లు చేసుకునేలా అన్ని ఆదేశాలు ఇస్తా" అని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఒక సర్వే నంబర్లో 500 ఎకరాలుంటే.. కోర్టు ఆదేశాలు ఇస్తే.. ఆ సర్వే నంబర్ మొత్తాన్ని నిషేధిత జాబితా (22ఏ)లో పెడుతున్నారని చెప్పారు. అందుకే ఆయా భూములకు బై నంబర్లు ఇస్తామని, కేసు, కోర్టు ఆదేశాలు ఉన్న విస్తీర్ణాన్నే పక్కన పెడతామని, మిగతా భూముల్లో రిజిస్ట్రేషన్లు అయ్యేలా చూస్తామని వివరించారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని భరోసానిచ్చారు. ఆనాడు కొడంగల్‌లో ఓడితే తనని మల్కాజిగిరి ఎంపీగా గెలిచేందుకు కూకట్‌పల్లి నియోజకవర్గ ప్రజలు సంపూర్ణంగా అండగా నిలబడ్డారని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. "ఇప్పుడు సీఎంగా బాధ్యతలు నిర్వహిస్తున్నా. వాళ్ల రుణం తీర్చుకునే అవకాశం వచ్చింది. మీకు ఏమి కావాలన్నా కూకట్‌పల్లి ప్రజలు పనులు చేయించుకోండి. మా మంత్రులందరికీ వేదిక మీద నుంచే ఆదేశాలిస్తున్నా. కూకట్‌పల్లిని ప్రత్యేకంగా చూడాలి" అని వ్యాఖ్యానించారు.

# రాజధానికి.. (మొదటిపేజీ తరువాయి)

ఈ తరహా వ్యక్తులతో రాష్ట్రానికి చాలా ప్రమాదం.." "2047 నాటికి ఏపీని స్వర్ణాంధ్ర చేయాలన్న సంకల్పం తీసుకున్నాం. 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని చేతిలో జాతీయ జెండా, మనస్సులో అజెండాతో సాధించాల్సిన లక్ష్యాన్ని సంకల్పం చేయాలి. అనునిత్యం మీ సంకల్పాన్ని నెరవేర్చుకునే ఆలోచనలు చేస్తే, రాష్ట్రాభివృద్ధి, దేశాభివృద్ధి సాధ్యమవుతాయి. మనకు స్వాతంత్ర్యం ఎందుకొచ్చిందన్న అంశాన్ని అంతా మరచిపోతున్నారు. జెండా వందనంతో పాటు దేశాన్ని అగ్రస్థానంలో నిలబెట్టేలా ఆలోచనలు చేయడం ముఖ్యం. ప్రతి ఇల్లు, వాణిజ్య సంస్థ పైనా జాతీయ జెండా ఎగరాలి. మండల, అసెంబ్లీ నియోజకవర్గాలు, జిల్లాల్లో తిరంగా ర్యాలీలు చేయాలి. వచ్చే 21 ఏళ్లలో వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర కల సాకారం కావాలి. అమరావతి ఆర్థిక రాజధానిగా ఎదగాలి" అని చంద్రబాబు ఆకాంక్షించారు. సీడ్ యాక్సెస్ రోడ్డు పూర్తి చేసి రాకపోకలకు అనుగుణంగా, అద్భుతంగా తీర్చిదిద్దారంటూ మంత్రి నారాయణను అభినందించారు. ప్రత్యేకంగా ఆయన్ను పిలిచి.. ఆయనతో కలిసి ఆ రోడ్డుపై ఫొటో దిగారు. కార్యక్రమంలో మంత్రి నాదెండ్ల మనోహర్, ఎంపీ భాష్యం రామకృష్ణ, ఎమ్మెల్యేలు శ్రావణ్‌కుమార్, కొలికిపూడి శ్రీనివాసరావు, సీఆర్డీయే కమిషనర్ విజయరామరాజు, ఏడీసీఎల్ సీఎండీ లక్ష్మీపార్థసారథి, కలెక్టర్ సాయికాంత్ వర్మ, కార్పొరేషన్ల చైర్మన్లు, రాజధాని రైతులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ఆలింగనాలే.. (మొదటిపేజీ తరువాయి)

ఒకప్పుడు స్వతంత్ర శక్తిగా ఉన్న ఆరెస్సెస్ ఇప్పుడు చనిపో యిందని, మోదీలాగే ఆరెస్సెస్ వారు కూడా గౌతమ్ అదానీ, ముకేశ్ అంబానీకి సేవకులుగా మారిపోయారని విమర్శించారు. రాజీనామా చేసే వరకు ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షాలను నిద్రపోనీయమన్నారు.

**బీజేపీ నేతల ఫైర్**

రాహుల్ 'ఆలింగనం విమర్శల'పై రాజకీయ దుమారం రేగింది. మోదీపై ఆయన వ్యాఖ్యలు నీచంగా ఉన్నాయని బీజేపీ ధ్వజమెత్తింది. రాహుల్ అనాగరిక, అనుచిత భాష ప్రతిపక్ష నేత స్థాయిని దిగజార్చేలా ఉందని విమర్శించింది. మోదీని, ఇటలీ ప్రధాని మెలోనీని హేళన చేయడం, దానికి కాంగ్రెస్ నాయకులు పగలబడి నవ్వడం.. ఆ పార్టీ రాజకీయ అపరిపక్వతకు నిదర్శనమని పేర్కొంది. 'రాహుల్ ఇంకెప్పుడు ఎదుగుతారు? దేశాన్ని నడిపించడానికి పరిణతి కలిగిన నాయకత్వం అవసరం. అంతేకానీ కానీ మీ అపరిపక్వ డ్రామాలు కాద'ని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి అన్నారు. రోత పుట్టించే చౌకబారు భాషతో ప్రధానిపై విమర్శలు చేయడం రాజకీయం అనిపించుకోదని కేంద్ర మంత్రి బండి సంజయ్ హితవు పలికారు. రాహుల్ తీరు దేశ రాజకీయాలకు తలవంపులు తెచ్చేలా ఉందని విమర్శించారు. ఇంకా పలువురు ఎంపీలు, బీజేపీ నేతలు, మహిళా మోర్చా సహా వివిధ విభాగాల నేతలు రాహుల్‌పై మండిపడ్డారు. అయితే బీజేపీ విమర్శలపై కాంగ్రెస్ స్పందిస్తూ రాహుల్ ఎక్కడా మెలోనీ పేరును ప్రస్తావించలేదని పేర్కొంది. 'రాహుల్ మెలోనీ అనే పదాన్నే వాడలేదు. ఆయన సందీప్ దీక్షిత్‌ను ఆలింగనం చేసుకున్నారు. ఇందులో తప్పేముంది?' అని కాంగ్రెస్ అధికార ప్రతినిధి షామా మొహ్మద్ అన్నారు. విదేశీయులు కరచాలనం చేయడానికే ఇష్టపడతారని, బాగా తెలిసినవారైతే తప్ప ఆలింగనానికి ఇష్టపడరని చెప్పారు.

# ప్రభుత్వం అందించిన బూట్లను విద్యార్థులకు పంపిణీ చేసిన సర్పంచ్

**కెరమెరి, ఆగస్టు 13**

కెరమెరి మండలం సాంగ్వి గ్రామంలోని ఎంపీపీఎస్ పాఠశాలలో గురువారం నాడు ప్రభుత్వం నుండి విద్యార్థులకు అందిన బూట్లను పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ విమలభాయి హాజరై విద్యార్థులకు బూట్లను అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, విద్యార్థుల ఆరోగ్యం మరియు పరిశుభ్రత కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చదువుతో పాటు క్రమశిక్షణ, పరిశుభ్రత కూడా ముఖ్యమని పిల్లలకు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ప్రకాష్, ఉపాధ్యాయులు,మాజీ సర్పంచ్ బాపూరావు,గ్రామ పెద్దలు మొహర్లే కన్ను ,తదితరులు పాల్గొన్నారు.

# తొలి నుంచీ మళ్లీ విచారణ

**ఓటుకు నోటు కేసులో కీలక మలుపు**

**విచారణ జరిపిన ధర్మాసనంలో ఉన్న**

**కొత్తగా విచారణ ప్రారంభిస్తాం: సుప్రీంకోర్టు**



**న్యూఢిల్లీ, ఆగస్టు 13**

పదకొండేళ్ల క్రితం తెలుగు రాష్ట్రాలను కుదిపేసిన 'ఓటుకు నోటు' కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో గతంలో కొంతమేర జరిగిన విచారణను సుప్రీంకోర్టు రద్దు చేసింది. విచారణను మళ్లీ మొదటి నుంచి ప్రారంభిస్తామని భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం గురువారం స్పష్టం చేసింది. దీనికి సంబంధించిన పూర్వాపరాలు ఇలా ఉన్నాయి. ఓటుకు నోటు కేసును ఎన్నికల చట్టాల నియమావళి కింద కాకుండా అవినీతి నిరోధక చట్టం కింద నమోదు చేశారని, కాబట్టి ఆ కేసు చెల్లదని 2021 జూలై 22వ తేదీన రేవంత్‌రెడ్డి సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ (క్రిమినల్) దాఖలు చేశారు. 'అవినీతి నిరోధక చట్టం-1988లోని సెక్షన్లు 7, 11 కింద లంచం తీసుకోవడమే నేరం. లంచం ఇవ్వడానికి కుట్ర చేశారనడం ఆ సెక్షన్ల కింద చెల్లదు. 2018లో లంచం ఇవ్వడం, అందుకు ప్రేరేపించడం వంటి పనులను కూడా నేరంగా పరిగణించేలా ఈ చట్టంలోని సెక్షన్ 8ను సవరించారు. అయితే, 2015లో నమోదు చేసిన ఓటుకు నోటు కేసుకు అప్పటి వరకు ఉనికిలో ఉన్న చట్టాలే వర్తిస్తాయి. అంతేకాదు, సెక్షన్ 7, 11, 12లు అధికారిక విధి నిర్వహణ (ప్రభుత్వ ఉద్యోగాలు) చేసే వారికి మాత్రమే వర్తిస్తాయి. శాసన మండలి ఎన్నికల్లో ఓటు వేయడం, ఓటు వేయకపోవడం అనేది ఈ చట్టం పరిధిలోకి రాదు. కాబట్టి, నిబంధనలకు విరుద్ధంగా నమోదైన ఈ కేసు చెల్లదు' అని రేవంత్ రెడ్డి తన పిటిషన్‌లో పేర్కొన్నారు. మరోవైపు, ఓటుకు నోటు కేసులో తన పేరును తొలగించాలని కోరుతూ అంతకుముందు 2021 ఏప్రిల్ 13వ తేదీన సండ్ర వెంకట వీరయ్య సైతం సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ రెండు పిటిషన్లను కలిపి సుప్రీంకోర్టు విచారిస్తోంది. ఈ క్రమంలోనే జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం గురువారం ఈ పిటిషన్లపై విచారణ జరిపింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్ర, తెలంగాణ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది దామా శేషాద్రి నాయుడు హాజరయ్యారు. విచారణ ప్రారంభం కాగానే ఇరుపక్షాల న్యాయవాదులు.. సుదీర్ఘ వాదనలు వినిపించాల్సిన అవసరం ఉన్నదని, కాబట్టి, కేసు విచారణను వాయిదా వేయాలని కోరారు. సీజేఐ స్పందిస్తూ.. గతంలో ఈ కేసు విచారణను చేపట్టిన ధర్మాసనంలో ఒక న్యాయమూర్తి పదవీ విరమణ చేశారని, కాబట్టి ఇప్పటి వరకూ జరిగిన విచారణను పక్కన పెడుతున్నట్లు తెలిపారు.

# ఉచిత పథకాలా.. అభివృద్ధి పథకాలా?

## గల్లీ నాయకుడి నుంచి ఢిల్లీ నాయకుడి వరకు.. ప్రజలను ఆకర్షించడానికే హామీలేనా?

### ప్రజలకు తాత్కాలిక ఉపశమనమా.. శాశ్వత అభివృద్ధా?

**మెట్ పల్లి ఆగస్టు 13**

ఎన్నికలు సమీపించిన ప్రతిసారి రాజకీయ పార్టీల నుంచి కొత్త కొత్త హామీలు, ఉచిత పథకాల ప్రకటనలు వెల్లువెత్తడం సాధారణంగా మారింది. గల్లీ స్థాయి నాయకుడి నుంచి ఢిల్లీ స్థాయి నాయకుడి వరకు ఓటర్లను ఆకట్టుకునేందుకు సంక్షేమ పథకాలను ప్రధాన ప్రచార అస్త్రంగా ఉపయోగిస్తున్నారనే చర్చ ప్రజల్లో కొనసాగుతోంది. అయితే ప్రకటించిన ప్రతి పథకం పూర్తిస్థాయిలో అమలవుతోందా? అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రయోజనం అందుతోందా? పథకాల కోసం కేటాయించిన నిధులు, వాస్తవంగా ఖర్చవుతున్న మొత్తం ఎంత? అనే ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు కావాల్సిన అవసరం ఉంది.

**ఉచితం పేరుతో ప్రజలను ఆధారపడేలా చేస్తున్నారా?**

పేదలు, రైతులు, మహిళలు, వృద్ధులు, విద్యార్థులు, బలహీన వర్గాలకు ప్రభుత్వ సహాయం అందించడం సంక్షేమ ప్రభుత్వ బాధ్యతే. అయితే ఉచిత పథకాలతో ప్రజలకు తాత్కాలిక ప్రయోజనం కల్పించడమే కాకుండా, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, పరిశ్రమలు, విద్య, వైద్యం, సాగునీరు, రహదారులు వంటి శాశ్వత అభివృద్ధి కార్యక్రమాలకు సమాన ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉంది.

ప్రజలకు నిరంతరం ఉచితాలు అందిస్తే పని చేయాలనే ఆసక్తి తగ్గి సోమరితనం పెరుగుతుందనే వాదన ఒకవైపు ఉంది. మరోవైపు, పేదరికంలో ఉన్న కుటుంబాలకు ప్రభుత్వం అందించే ఆహారం, విద్యుత్, వైద్యం, గృహం వంటి సహాయం వారి కనీస జీవన ప్రమాణాలను కాపాడేందుకు అవసరమని నిపుణులు చెబుతున్నారు. అందువల్ల ప్రతి సంక్షేమ పథకాన్ని ఒకే కోణంలో చూడకుండా, అది ప్రజలను స్వయం సమృద్ధి వైపు తీసుకెళ్తుందా లేదా ప్రభుత్వ సహాయంపై ఆధారపడేలా చేస్తుందా అన్నది పరిశీలించాల్సిన అవసరం ఉంది.

**తెలంగాణలో అమలవుతున్న పథకాలు**

తెలంగాణ ప్రభుత్వం 2026–27 బడ్జెట్‌లో ఆరు గ్యారంటీలకు సంబంధించిన పథకాలకు భారీగా నిధులు కేటాయించింది. రుణమాఫీ, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, మహిళలకు ఆర్టీసీ ఉచిత ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500కే ఎల్పీజీ సిలిండర్ తదితర సంక్షేమ కార్యక్రమాలకు బడ్జెట్‌లో కేటాయింపులు ఉన్నాయి. ఆరు గ్యారంటీలకు సంబంధించి పలు పథకాల కోసం మొత్తం రూ.50,713 కోట్ల మేర కేటాయింపులు చేసినట్లు రాష్ట్ర బడ్జెట్ వివరాలు చెబుతున్నాయి.ఇటీవల రైతు భరోసా కింద 73.30 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.9,000 కోట్లు జమ చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. అలాగే 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇళ్లు వంటి పథకాలు అమలు చేస్తున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది.

**అయితే అన్ని హామీలు పూర్తిగా అమలయ్యాయా?**

ఇదే ఇప్పుడు ప్రజల్లో ప్రధాన ప్రశ్న. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ కాగితాలపై ఉన్నాయా? లేక క్షేత్రస్థాయిలో ప్రతి అర్హుడికి చేరుతున్నాయా? పథకాల లబ్ధిదారుల సంఖ్య ఎంత? దరఖాస్తు చేసుకున్న వారిలో ఎంతమందికి ప్రయోజనం అందింది? ఇంకా ఎంతమంది ఎదురుచూస్తున్నారు? అనే వివరాలను ప్రభుత్వం ఎప్పటికప్పుడు ప్రజలకు బహిరంగంగా వెల్లడించాల్సిన అవసరం ఉంది.పథకానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించడం ఒక దశ మాత్రమే. ఆ నిధులు విడుదల కావడం, అర్హుల




ఎంపిక, లబ్ధిదారుల ఖాతాల్లోకి చేరడం, చివరకు ఆ పథకం వల్ల కుటుంబం ఆర్థికంగా బలపడటం–ఈ మొత్తం ప్రక్రియను పరిశీలించినప్పుడే పథకం విజయవంతమైందా లేదా అన్నది తెలుస్తుంది.

**ఉచితాల కంటే ఉపాధికి ప్రాధాన్యం అవసరం**

ప్రజలకు ఉచితంగా ఏదైనా ఇవ్వడం కంటే వారికి స్థిరమైన ఆదాయ మార్గాన్ని కల్పించడం దీర్ఘకాలిక పరిష్కారం. ఒక కుటుంబానికి కొంతకాలం ఉచిత సాయం అందించడం కంటే అదే కుటుంబంలోని యువతకు నైపుణ్య శిక్షణ, ఉద్యోగం, చిన్న పరిశ్రమకు రుణం, మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తే ఆ కుటుంబం భవిష్యత్తులో ప్రభుత్వ సహాయం లేకుండానే నిలబడగలదు.అందుకే ప్రభుత్వాలు సంక్షేమ పథకాలతో పాటు ఉపాధి, పరిశ్రమలు, వ్యవసాయం, విద్య, వైద్యం, మౌలిక వసతులపై సమానంగా దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

**ప్రజల సొమ్ము.. ప్రజలకే లెక్క**

ఉచిత పథకాలు ఎవరి వ్యక్తిగత డబ్బుతోనూ అమలు కావు. అవి ప్రధానంగా ప్రభుత్వ బడ్జెట్, అంటే ప్రజల పన్నులు మరియు ప్రభుత్వ ఆదాయ వనరుల నుంచే వస్తాయి. అందువల్ల ప్రతి పథకానికి ఎంత ఖర్చు చేస్తున్నారు? ఎంతమంది లబ్ధి పొందుతున్నారు? పథకం వల్ల వాస్తవంగా ఎంత ప్రయోజనం కలుగుతోంది? అనే వివరాలను ప్రజలకు పారదర్శకంగా తెలియజేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. ఉచిత పథకాలపై దేశవ్యాప్తంగా చర్చ కొనసాగుతోంది. 2022లో సుప్రీంకోర్టు కూడా ఎన్నికల సమయంలో ప్రకటించే 'ఫ్రీబీస్' అంశంపై అన్ని భాగస్వాములతో సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉందని పేర్కొంది.

**ప్రజలు అడగాల్సిన ప్రశ్న ఇదే**

ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చే ప్రతి నాయకుడిని ప్రజలు ఒకే ప్రశ్న అడగాలి–"పథకం ప్రకటిస్తారా?" అన్నది కాదు.. "పథకం ఎలా అమలు చేస్తారు? డబ్బు ఎక్కడి నుంచి తెస్తారు? ఎంతకాలం అమలు చేస్తారు? లబ్ధిదారులు ఎవరు? ఉపాధి, అభివృద్ధిపై దాని ప్రభావం ఏమిటి?" అన్నదే. ప్రజలకు సంక్షేమం అవసరమే. కానీ సంక్షేమంతో పాటు స్వయం సమృద్ధి, ఉపాధి, నాణ్యమైన విద్య, మెరుగైన వైద్యం, రహదారులు, తాగునీరు, సాగునీరు, పరిశ్రమలు కూడా అవసరం. ఉచిత పథకం తాత్కాలిక ఉపశమనం ఇవ్వొచ్చు.. కానీ శాశ్వత అభివృద్ధి మాత్రమే ప్రజల భవిష్యత్తును మార్చగలదు.ఇక నిర్ణయం ప్రజలదే–ఉచిత హామీలను చూసి ఓటేయాలా? లేక హామీల అమలు, అభివృద్ధి, ఆర్థిక ప్రణాళికను చూసి ఓటేయాలా?

# డబుల్ బెడ్రూమ్ ఇండ్లలో నివాసం తప్పనిసరిగా ఉండాలి

### ప్రాజెక్ట్ డైరెక్టర్ బన్సీలాల్



**రామకృష్ణాపూర్, ఆగస్టు 13, (మన సమాజం):**

నిరుపేదలకు కేటాయించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో లబ్ధిదారులు తప్పనిసరిగా నివాసం ఉండాలని గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ బన్సీలాల్ సూచించారు. క్యాతనపల్లి మున్సిపాలిటీలో పేదలకు కేటాయించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వం ఇండ్లను కేటాయించి సంవత్సరం గడుస్తున్నప్పటికీ ఇప్పటివరకు చాలామంది ఇండ్లలో నివాసం ఉండడం లేదని ఇప్పటికే నోటీసులు అందజేశామని పేర్కొన్నారు. ఎవరైతే నోటీసులు అందుకున్న వారు ఈనెల 25వ తేదీలోపు ఖచ్చితంగా గృహంలో ఉండాలని, లేని పక్షంలో ఇంటి పట్టా రద్దుచేసి అర్హులైన ఇతర పేదల కుటుంబాలకు అట్టి ఇండ్లను కేటాయించడం జరుగుతుందని హెచ్చరించారు. ఇదే చివరి అవకాశంగా భావించి ప్రతి ఒక్కరూ గృహప్రవేశం చేయవలసిందిగా కోరారు. ఆయన వెంట ఏఈ సాయిరాం, లబ్ధిదారులు దండు సదానందం, బీసా శ్రీనివాస్, ఎల్కటూరి నరేష్, అనంతుల రవి ఉన్నారు.

## మహిళలపై అత్యాచారాలకు

# అడ్డుకట్ట ఏదీ?

### కఠిన చర్యలు తీసుకోవడంలో పాలకుల విఫలం

**న్యూఢిల్లీ:** అంతర్జాతీయ మహిళా దినోత్సవాలను ఏటా జరుపుకుంటున్నా..వారి గురించి ఘనంగా చెప్పుకుంటున్నా దేశ వ్యాప్తంగా మహిళలు, పిల్లలపై అత్యాచారాలు, హింస బాగా పెరిగాయి. ప్రతిరోజూ దేశంలో ఏదో ఒక మూల మహిళలపై అత్యాచారం, హింస, దాడులు, హత్యలు జరుగుతు న్నాయి. ఇండ్ల దగ్గర నుంచి వసతి గృహాల వరకు ఆడపిల్లలను లైంగిక అవసరాలకు వాడుకొనే వికృత స్థితి వ్యాపించింది. అత్యాచారం, అక్రమ రవాణా, హత్యలు సాధారణ విషయాలైపోతున్నాయి. దేశంలో నెలకొన్న పరిస్థితులు మహిళలు, పిల్లల జీవితాలకు భద్రత లేకుండా చేస్తున్నాయి. దేశంలో మహిళలు, బాలికలు ముఖ్యంగా దళిత బాలికలపై అత్యాచారాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. వీటిని అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలం అవుతున్నాయి. పని ప్రదేశాల్లో శ్రామిక మహిళలు వివక్ష, వేధింపులకు గురవుతు న్నారు. మహిళలకు సమాన హక్కులు, శ్రమకు గుర్తింపు, సమాన వేతనాలు, సమాన హక్కుల కోసం, మహిళలపై అత్యాచారాలు, హింసను అరికట్టడం, నేరస్థులకు కఠిన శిక్షలు అమలు చేయడంలో విఫలమైనందకు పాలకులు సిగ్గు పడాలి. మహిళలపై హింసకు పాల్పడ్డవారిని శిక్షించటానికి బదులు, ఇటువంటి ఆంక్షలతో మహిళలకే శిక్ష విధిస్తున్నారు. బేటీపడావో,..బేటీ బచావో నినాదాం వినడానికే పరిమితం అయ్యింది. మహిళా సాధికారత గురించి చెప్పడమే తప్ప అవకాశాలు రావడం లేదు. పని ప్రదేశాలలో లైంగిక వేధింపుల నిరోధక చట్టం వచ్చి ఐదేండ్లు దాటిపోయినా కనీసం ప్రభుత్వ రంగంలోనైనా ఈ చట్టం సరిగ్గా అమలు కాకపోవటం అన్యాయం. ఒకప్పుడు మహిళ అంటే వంటింటికే పరిమితమన్న భావన అందరిలోనూ ఉండేది. కానీ నేడు ఎందులోనూ తీసిపోమంటూ మహిళామణులు ముందుకు దూసుకెళ్తు న్నారు. పలురంగాల్లో ప్రతిభను కనబరుస్తూ అద్భుతాలు సృష్టిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. గల్లీ నుంచి ఢిల్లీ వరకు రాజకీయాల్లో రాణిస్తూ ప్రజాస్వామ్యానికి ప్రాణం పోస్తున్నారు. అయినా చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు తదితర సమస్యలకు పరిష్కారం కరువైంది. ఇంటి పని, వంట పని, గృహ నిర్వహణ, పెద్దల, పిల్లల, సంరక్షణ, నీళ్ళు, వంట చెరుకు తీసుకురావటం మొదలైన పనులతో మహిళలు రోజు మొత్తం శ్రమిస్తున్నారు. భారతదేశంలో మహిళలు తమ ఇల్లు, పిల్లలు, పెద్దల కోసం చేస్తున్న జీతభత్యంలేని శ్రమ విలువ కట్టలేం. అలాగే గ్రామీణ ప్రాంతాల్లోని రైతు, వ్యవసాయ, గ్రామీణ కార్మికకుటుంబాల్లోని స్త్రీలు వీటితో పాటు పశువుల పెంపకం, వ్యవసాయ పనులు కూడా చేస్తారు. మంచినీరు, వంటచెరకు, పిల్లలు, వృద్ధుల సంరక్షణా కేంద్రాలు, ఆరోగ్య వసతులు అందుబాటులో లేకపోవడంతో ఈ మొత్తం బాధ్యత, పనులు ఆడవారి మీదే పడుతున్నాయి. ఇన్ని బాధ్యతలు మోస్తున్నా వారిని మనం పనివస్తువుగా చూడడం సిగ్గుచేటు. రావటంతో వారి సమయం, శక్తి మొత్తం ఈ వేతనం లేని శ్రమకే వెచ్చిస్తున్నారు. ఇటువంటి వేతనంలేని సంరక్షణ పనుల కోసం పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు రోజులో 5 గంటలకుపైగా వెచ్చిస్తున్నారు. వీటన్నిటితో పాటు పని ప్రదేశాలలో శ్రామిక మహిళలు వేతనాలు, సర్వీసు కండీషన్లు, గౌరవం, పదోన్నతుల విషయంలో తీవ్ర వివక్షకు, అవమానాలకు గురవుతున్నారు. పని భారం కారణంగా అత్యధిక మంది మహిళలు తప్పనిసరి పరిస్థితుల్లో ఉద్యోగాలు వదిలేస్తున్నారు. మన దేశంలో సగం మంది మహిళలలో అత్యధిక మంది సంరక్షణ, సేవ పనులు చేస్తున్నారు. ఆరోగ్య సంరక్షణ, అనుబంధ పౌష్టికాహారాన్ని అందించే అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన కార్మికులు మొదలైన స్కీమ్ వర్కర్లను ప్రభుత్వం కార్మికులుగా గుర్తించటం లేదు. ఇక అత్యాచార దోషులను శిక్షించడానికి బదులు దోషులతో మననేతలు అంటకాగుతున్నారు. చివరికి 3,4 ఏండ్ల పసిపిల్లలను కూడా వదలటంలేదు. ఆడవారు ఏ రకమైన బట్టలు ధరించాలి, ఎవరితో మాట్లాడాలి, ఎక్కడికి వెళ్లాలి అనే విషయాలపై ఆంక్షలు విధిస్తున్నారు. ఇంటిని చక్క దిద్దుకుంటునే ఉద్యోగ భాధ్యతలు నిర్వహిస్తోంది. పొలంలోనే కాదు.. సమస్యలపై పోరాటల్లోనూ అగ్రభాగాన నిలుస్తోంది. రంగం ఏదైతేనేమీ అన్నింటా తనదైన ముద్ర వేస్తోంది.

# అత్యంత నిరుపేద కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి



**రాయికల్ రూరల్, ఆగస్టు 14**

రాయికల్ మండల పరిధిలోని మహితాపూర్ గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన దుమాల రవి (35)నిరుపేద యువకుడు అనారోగ్యానికి గురై జగిత్యాల పట్టణంలోని ప్రభుత్వ హాస్పిటల్ లో గత కొన్ని రోజులుగా చికిత్స పొందుతూ బుధవారం ఉదయం రవి ఆరోగ్యం క్షీణించి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి భారత రాష్ట్ర సమితి పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి గురువారం రోజున ఉదయం మండల మరియు గ్రామ నాయకుల తో కలిసి పరామర్శించారు. మృతి ని కుటుంబానికి గ్రామంలో ఆయన కుటుంబం నివాసం నివాసించేందుకు కూడ ఇల్లు లేకపోవడంతో వారు ఈ రోజు గ్రామంలో ఉన్న శ్మశాన వాటిక లోనే కర్మకఖండ లు జరిపించడం వల్ల అక్కడకు చేరుకున్న మాజీ మంత్రి జీవన్ రెడ్డి వారిని చూసి చలించిపోయారు. వెంటనే వారికి ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయం అందజేశారు.అనంతరం మృతి చెందిన కుటుంబానికి అన్ని విధాలుగా ప్రభుత్వ పరంగా ఆదుకోవాలి అన్నారుప్రస్తుతం చేయూత పథకం కింద పెన్షన్ మరణించిన రవి మరణ ధ్రువీకరణ సర్టిఫికెట్ తీసుకుని వెంటనే చేయూత పథకం కింద వితంతు పింఛను మంజూరు చేయించాలని గ్రామ నాయకులను ఆదేశించారు. మరణించిన రవి భార్య పిల్లలకు ఇంటిని మంజూరు చేయాలని అన్నారు. మరణించిన రవి పిల్లలకు విద్యకు ఎలాంటి అవసరం ఉన్న తోడుగా నిలుస్తాను అన్నారు. వారి వెంట. రాయికల్ మున్సిపల్ చైర్మన్ కటుకం రవీందర్. మాజీ జడ్పిటిసి సభ్యులు గోపి మాధవి రాజారెడ్డి రాయికల్ మండల బి అర్ ఎస్. పార్టీ అధ్యక్షుడు బర్కం మల్లేశం రాయికల్ పట్టణ అధ్యక్షులు ఎలిగెటి అనిల్ మహితాపూర్ మాజీ యంపిటిసి గోపి రాజారెడ్డి మహితాపూర్. రామోజీ పేట గ్రామ పంచాయితీ ఉప సర్పంచ్ లు దొంగ ప్రణయ్ రెడ్డి ఇద్దశీ సుధీర్ రెడ్డి గ్రామ వార్డు సభ్యులు బుస గంగా మల్లయ్య అనుమల్ల రమ సత్యనారాయణ నెమిళ్ల లత స్వామి రెడ్డి మండల గ్రామ నాయకులు కొయ్యడి మహిపాల్. మంద రమేష్ జకిలేటి హరీష్ రావు. కడుతల లక్ష్మినారాయణ ఎనగంటి రవి. కొల్ల బుచ్చి రెడ్డి వేణు గోపాల్ లంక దాసరి తిరుపతి. గంగుల శ్రీనివాస్ అనుమల్ల సత్యనారాయణ. శ్రీనివాస్ సంబ గంగాధర్. మిట్టపల్లి రామన్న తురగ నారాయణ రెడ్డి మ్యాకల రాజేషం లింగారెడ్డి. నందన. బొమ్మన సూరత్ తదితరులు పాల్గొన్నారు.

# అవినీతి నేతల పీచమణచాల్సిందే !

ఢిల్లీ లిక్కర్ కేసు చాలా నచిన్నది అంటూ ఎమ్మెల్సీ కవిత వ్యాఖ్యానించారు. కాళేశ్వరంలో అసలు అవినీతే జరగేలదని బిఆర్ఎస్ నేతలు మాట్లాడుతున్నారు. ఎపిలో జగన్ అన్నిరంగాల్లో అవినీతికి తెరతీసారు. అయినా అవినీతికి తావులేకుండా అని మాట్లాడుతున్నారు.

మిగతా రాష్ట్రాల సంగతి ఎలా ఉన్నా తెలుగు రాష్ట్రాల్లో అవినీతి తారాస్థాయికి చేరింది. అవినీతి జరిగిందని చెబుతున్న కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని బిజెపి నేతలు ఇంచుమాత్రం కూడా చర్యలకు సిద్దంగా లేరు. అవినీతి నేతలను కాపాడుతూ వస్తున్నారు. ఇదో రకమైన అవినీతిగానే గుర్తించాలి. మోడీ అవినీతి చర్యలన్నీ కక్షసాధింపు చర్యలుగానే ఉన్నాయి. తనకు అనుకూలంగా లేని పార్టీల నేతల అవినీతినే భూతద్దంలో చూస్తున్నారు. తెలంగాణలో కెసిఆర్ , ఆయన కుటు ంబ అవినీతి, జగన్ అవినీతిని పట్టించుకోవడం లేదు. మొత్తంగా దేశంలో ఇప్పుడు అక్రమాలకు, అన్యాయాలకు పాల్పడుతున్నది కేవలం రాజకీయ నేతలు మాత్రమే. వారే అవినీతిలో కూరుకుపోతున్నారు. అధికారం చేపట్టిన ఏడాది లోనే రాజమందిరాలు నిర్మించుకోవడం, కోట్లు కూడబెట్టడం, అక్రమా లకు పాల్పడడం చూస్తున్నాం.



## ఆమె నిబద్ధత చూసి ఆశ్చర్యపోయా

ప్రస్తుతం భారీ అంచనాలతో తెరకెక్కుతున్న పానిండియా సినిమాల్లో 'టాక్సిక్' తొలి వరుసలో ఉంటుంది. 'కేజీఎఫ్'ఫేం యశ్ కథానాయకుడిగా గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో కియారా అద్వాణీ కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే. నిర్మాణం తుదిదశకు చేరుకున్న ఈ చిత్రం త్వరలో విడుదల కానున్నది. ఈ సందర్భంగా కియారా తన తాజా ఇంటర్వ్యూలో 'టాక్సిక్' సెట్‌లో తన అనుభవాలను పంచుకున్నది. 'డైరెక్టర్ గీతూ మోహన్‌దాస్ నిబద్ధత చూసి ఆశ్చర్యపోయా. టైమ్‌కి చాలా విలువ ఇచ్చేవారామె. ఒకసారి ఫోన్ చేసి.. 'రేపు నువ్వు సెట్‌లోకి రాగానే పూర్తిగా పాత్రలోనే ఉండాలి. ఎలాంటి మర్యాదలు, పలకరింపులు వద్దు.నేరుగా క్యారెక్టర్ జోన్‌లోకి వచ్చేయాలి' అని సీరియస్‌గా చెప్పారు. నిజానికి నేను ఆ విధానానికి పూర్తి వ్యతిరేకం. సెట్‌లోకి రాగానే ముందు అందర్నీ విష్ చేయడం నాకు అలవాటు. లొకేషన్లో ఉత్సాహంగా ఉండే మనిషిని. కానీ డైరెక్టర్ మాట వినాలి కాబట్టి తను చెప్పినట్టే చేశాను' అని గుర్తు చేసుకున్నది కియారా అద్వాణీ. ఇందులో నదియా అనే పాత్రలో కియారా నటిస్తుండగా, నయనతార గంగ పాత్రలో కనిపించనున్నది. 'ఎలిజిబెత్' అనే పాత్రలో హ్యూమా ఖురేషి, 'రెబెకా'గా తారా సుతారియా, 'మెలిసా' పాత్రలో రుక్మిణి వసంత్ కనిపించనున్నారు.

## ఎల్లమ్మగా మమితాబైజు?



'బలగం' తర్వాత దర్శకుడు 'ఎల్లమ్మ' సినిమా ప్రకటించిన నాటినుంచీ ఈ సినిమాలో నటించే తారల వ్యవహారం ఓ ప్రహసనంగా మారింది. హీరోగా ముందు చాలామంది పేర్లు అనుకున్నారు. చివరకు సంగీత దర్శకుడు దేవిశ్రీప్రసాద్ ఖరారయ్యారు. ఆయనపై తాజాగా గ్లింప్స్ కూడా రిలీజ్ చేశారు. ఇక 'ఎల్లమ్మ'లో హీరోయిన్ ఎవరు? ప్రస్తుతం ఫిల్మ్ వర్గాలను వెంటాడుతున్న ప్రశ్న ఇది. మొదట్లో సాయిపల్లవి అన్నా ఆ తర్వాత కీర్తి సురేశ్ పేరు వినిపించింది. ఈ వరుసలోనే చాలామంది హీరోయిన్ల పేర్లు మీడియాలో చక్కర్లు కొట్టాయి. చివరకు మలయాళ మందారం మమితాబైజు ఖరారైందంటూ ఓ వార్త బలంగా వినిపిస్తున్నది. అయితే.. ఈ పేరు బయటకు వచ్చిన నాటినుంచీ, ప్రేమలు, డ్యూడ్ లాంటి ట్రెండీ క్యారెక్టర్లు చేసే మమితాబైజు ఈ విలేజ్ డ్రామాలో ఇమడగలదా? అనే అనుమానాలను పలువురు వ్యక్తం చేస్తున్నారు. అయితే.. ధనుష్ 'కర' సినిమాలో ఆమెది విలేజ్ నేపథ్య పాత్రేననీ, తను స్వతహాగా మంచినటి కాబట్టి, ఎలాంటి పాత్రనైనా అలవోకగా చేయగలదని పలువురు అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా అధికారిక ప్రకటన వచ్చేదాకా ఇవన్నీ ఊహాగానాలే అనాలి

### ముసలిదానివి అయిపోతున్నావ్,

## పెళ్లి చేసుకోమన్న నెటిజన్..



సోషల్ మీడియాలో సెలబ్రిటీలపై ట్రోలింగ్ ఇప్పుడు సాధారణ విషయంగా మారిపోయింది. ముఖ్యంగా హీరోయిన్ల వయస్సు, పెళ్లి, వ్యక్తిగత జీవితాలపై తరచూ నెగెటివ్ కామెంట్లు వస్తూనే ఉంటాయి. తాజాగా బాలీవుడ్ నటి షమితా శెట్టి కూడా ఇలాంటి ట్రోలింగ్‌ను ఎదుర్కొన్నారు. అయితే ఈసారి ఆమె హుందాగా, ఘాటుగా ఇచ్చిన సమాధానం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇటీవల సోషల్ మీడియాలో షమితా శెట్టిపై ఓ నెటిజన్ చేసిన కామెంట్ చర్చనీయాంశమైంది. "మీ వయస్సు పెరిగిపోయింది.. ముసలితనం వచ్చేస్తోంది. ఇప్పటికైనా పెళ్లి చేసుకోవచ్చు కదా" అంటూ అతను కామెంట్ చేశాడు. ఈ కామెంట్‌ని చాలామంది సాధారణంగా పట్టించుకోకుండా వదిలేస్తారు. కానీ షమితా మాత్రం ఎంతో హుందాగా, అదే సమయంలో గట్టిగానే స్పందించారు. వయస్సుపై వచ్చిన విమర్శలకు స్పందించిన షమితా శెట్టి.. జీవితంపై తన పాజిటివ్ దృక్పథాన్ని వెల్లడించారు.అవును.. నా వయస్సు పెరుగుతోంది. దాంతో పాటు నాలో మార్పులు కూడా వస్తాయి. కాలంతో పాటు ప్రకృతిలో ప్రతిదీ మారుతుంది. శారీరక రూపురేఖలతో సహా ఈ ప్రపంచంలో ఏదీ శాశ్వతం కాదు అంటూ ఆమె పేర్కొన్నారు.అలాగే తాను ప్రస్తుతం ఎంతో ఆరోగ్యంగా, ఫిట్‌గా, మానసికంగా సంతోషంగా ఉన్నానని స్పష్టం చేశారు. నా వయస్సుకు తగ్గట్లుగా నేను చాలా ఫిట్‌గా ఉన్నాను. మానసికంగా ఎంతో ప్రశాంతంగా, సంతోషంగా జీవిస్తున్నాను. అది నాకు చాలు అంటూ షమితా చెప్పిన మాటలు ఇప్పుడు నెటిజన్ల ప్రశంసలు అందుకుంటున్నాయి. ఇక పెళ్లిపై వచ్చిన కామెంట్‌కు షమితా ఇచ్చిన కౌంటర్ మరింత వైరల్ అవుతోంది.పెళ్లి చేసుకుని మీరేం సాధించారు? అంతగా పెళ్లై సెటిల్ అయ్యామని అనుకునే మీరు.. నాలాంటి సింగిల్ వ్యక్తులను సోషల్ మీడియాలో ఎందుకు ఫాలో అవుతున్నారు? మా జీవితాలపై మీకెందుకు అంత ఆసక్తి? అంటూ ట్రోలర్‌ను నేరుగా ప్రశ్నించారు.ఈ సమాధానంతో సోషల్ మీడియాలో మహిళల వ్యక్తిగత జీవితాలపై అనవసర కామెంట్లు చేసే వారిపై ఆమె గట్టిగా స్పందించినట్లైంది.షమితా శెట్టి కామెంట్స్‌కు సోషల్ మీడియాలో భారీ స్పందన వస్తోంది. ముఖ్యంగా మహిళా అభిమానులు ఆమెకు మద్దతుగా నిలుస్తున్నారు.ఒక మహిళ పెళ్లి చేసుకోవాలా వద్దా అనేది ఆమె వ్యక్తిగత నిర్ణయం, వయస్సు పెరిగిందని ట్రోల్ చేయడం సరైంది కాదు, షమితా చాలా మెచ్యూర్‌గా సమాధానం ఇచ్చారు అంటూ నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు.

### ఈ అభిమానం

## ఇలాగే ఉండాలి

శ్రద్ధాకపూర్ కొత్త రికార్డును నమోదు చేసింది. మే 2026 లెక్కల ప్రకారం ఇన్‌స్టాగ్రామ్‌లో అత్యధిక ఫాలోవర్లు కలిగిన కథానాయికగా ఆమె అవతరించింది. తాజాగా బయటకొచ్చిన అత్యధిక ఫాలోవర్లు కలిగిన టాప్ హీరోయిన్ల అధికారిక ఇన్‌స్టా జాబితాలో, మిగతా స్టార్ హీరోయిన్లందరినీ వెనక్కి నెట్టి, ఏకంగా 93 మిలియన్లు అనగా, 9కోట్ల 3లక్షల ఫాలోవర్లతో టాప్‌లో నిలిచింది శ్రద్ధాకపూర్.ఈ పోటీలో శ్రద్ధాకు.. ప్రియాంక చోప్రా గట్టి పోటీనే ఇచ్చింది. 92 మిలియన్ల ఫాలోవర్లతో ఆమె రెండో స్థానంలో నిలవడం విశేషం. ఈ విజయంపై ఇన్‌స్టా ద్వారా శ్రద్ధా ఆనందాన్ని వ్యక్తం చేస్తూ.. 'మీ అభిమానమే నాకు కొండంత బలం. ఈ అభిమానం కలకాలం ఇలాగే ఉండాలి' అని పేర్కొన్నది. ఎప్పటికప్పుడు మారే ఈ నంబర్ల రేస్‌లో ఈసారి మాత్రం శ్రద్ధా కపూర్ నంబర్‌వన్ అనిపించుకుంది. వచ్చే ఏడాది ఈ స్థానంలో మరో హీరోయిన్ ఉండొచ్చు.

